సాక్షి ఖమ్మం

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



చర్చించండి.. పరిష్కరించండి

జిల్లా జనరల్ ఆస్పత్రిలో పలు సమస్యలు నెలకొనగా.. వ్యాధి నిర్ధారణ, చికిత్సలోనూ అవాంతరాలు ఎదురవుతున్నాయి. 8లో



పొంగి పొర్లిన వాగులు

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో జిల్లాలోని పలు వాగుల్లోకి వరద చేరగా రహదారులపైకి నీరు చేరింది. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కోర్టు భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో జిల్లా జడ్జి రాజగోపాల్, న్యాయమూర్తులు

మధిర: మధిరలో రూ.24 కోట్ల నిధులతో నిర్మించే కోర్టు భవన సముదాయానికి గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ భూమి పూజ చేశారు. మధిర సీనియర్, జూనియర్ సివిల్ కోర్టుల న్యాయమూర్తులు ఎస్.ప్రశాంతి, వేముల దీప్తితో కలిసి శంకుస్థాపన చేశాక ఆయన నిర్వహణలో ఉన్న కోర్టు రికార్డు రూంను పరిశీలించారు. అలాగే, నూతన భవన నిర్మాణంపై ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలు చేశారు. తొలుత జిల్లా జడ్జికి న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు స్వాగతం పలికి సత్కరించారు. మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు, న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, కట్టా పూర్ణచందర్‌రావు, దేవరపల్లి సుబ్రహ్మణ్యం, గంధం శ్రీనివాసరావు, జింకల రమేష్, సుంకు మోహన్‌దాస్, వెంకట్రావు, కోట జ్ఞానేష్, సంధ్య, మాధురి, సునీత, సూపరింటెండెంట్లు నాగమణి, వెంకన్న, మల్లేశ్వరరావు, మధిర టౌన్ సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: పండుగలు, వారాంతం నేపథ్యాన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం నుంచి ఆదివారం వరకు సెలవులు ప్రకటించారు. ఈనెల 8న శుక్రవారం వరలక్ష్మి వ్రతం, శనివారం రాఖీ పౌర్ణమి, వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉంటుందని ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తిరిగి సోమవారం నుంచి మార్కెట్ కార్యకలాపాలు మొదలవుతాయని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



ఆయిల్‌పామ్ తోటలో పరిశీలిస్తున్న మధుసూదన్

కల్లూరురూరల్: ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడమే కాక రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోందని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. కల్లూరు మండలం దారుగ బంజరులో ఆయిల్‌పామ్ తోటలు, మిర్చి నర్సరీలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల్లో మొక్కల పెంపకం, రికార్డుల నిర్వహణపై సూచనలు చేసిన మధుసూదన్ మాట్లాడారు. జిల్లాలో 34వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుండగా, మరో 14,500 ఎకరాల్లో తోటల సాగును లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ఎకరాకు సాగు ఖర్చుల కింద నాలుగేళ్లలో రూ.50వేలు, రాయితీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు ఇస్తున్నండగా.. అంతర పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం వస్తుందని చెప్పారు. ఇదే సమయాన సంప్రదాయ పంటలతో నష్టాలు వస్తున్నందున రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలని సూచించారు.

11న యూత్ ఫెస్ట్, పరుగు పందెం

ఖమ్మంవైద్యవిభాగం: రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకేతో పాటు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యాన హెచ్ఐవీ, ఎయిడ్స్ యూత్ ఫెస్ట్‌లో భాగంగా ఈనెల 11న పరుగు పందెం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అదనపు డీఎంహెచ్‌ఓ పి.వెంకటరమణ వెల్లడించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 11వ తేదీన ఉదయం 7–30 గంటలకు మొదలయ్యే పరుగు పందెంలో ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు కళాశాలకు ఇద్దరు చొప్పున పాల్గొనాలని సూచించారు. పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు 79899 99788(ఎస్.రామకృష్ణ), 91771 03193(వీరయ్య) నంబర్లలో సంప్రదించాలని వెంకటరమణ సూచించారు.

సెలవులో డీఈఓ

ఖమ్మం సహకారనగర్: జిల్లా విద్యాశాఖాధికారి(ఎఫ్ఏసీ) కె.నాగపద్మజ మూడు రోజులు సెలవులో వెళ్లారు. ఆమె స్థానంలో డీఈఓ కార్యాలయ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీప్రసాద్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. తిరిగి నాగపద్మజ సోమవారం విధుల్లోకి చేరతారు. ఇదిలా ఉండగా సీఎంఓగా ప్రవీణ్‌కుమార్, ఏఎంఓగా రాజశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.



ఖమ్మం వద్ద మున్నేటిలో గురువారం సాయంత్రం ప్రవాహం

ఆపదొస్తే అధిగమించేలా...

➜ **మున్నేరు పరీవాహక మండలాలు :** మహబూబాబాద్ జిల్లాలోని గూడూరు, కేసముద్రం, కురవి, గార్ల, డోర్నకల్, ఖమ్మం జిల్లాలోని కామేపల్లి, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు మండలం.

➜ **ఆకేరు పరీవాహక మండలాలు :** జనగామ జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్, జఫర్‌గఢ్, హనుమకొండ జిల్లాలోని ఐనవోలు, వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి, నర్సంపేట, మహబూబాబాద్ జిల్లాలోని పెద్దవంగర, తొర్రూరు మండలాలు

- మున్నేరు, ఆకేరు వరద తెలుసుకునేలా వాట్సాప్ గ్రూప్
- ఆరు జిల్లాల అధికారులతో సమన్వయం
- ఖమ్మం రూరల్‌లోని మూడు ప్రాంతాల్లో ఫ్లడ్ గేజ్‌ల ఏర్పాటు
- 18మండలాల్లో వర్షపాతం వివరాలు ఎప్పటికప్పుడు సేకరణ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వర్షాకాలం వచ్చిందంటే జిల్లాలోని మున్నేరు, ఆకేరు పరీవాహక ప్రాంతాల ప్రజల్లో వణుకు మొదలవుతుంది. గతేడాది ఆగస్టు 31న అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం 11గంటల వరకు ఊహించని రీతిలో వచ్చిన వరద పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాలను అతలాకుతలం చేసింది. పాడి, పంట, ఇళ్లకే కాక ఆస్తులకు భారీ నష్టాన్ని మిగిల్చింది. ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలో మున్నేటిపై ఉన్న ఫ్లడ్ గేజ్‌తో అధికారికంగా 38 అడుగుల మేర వరద వచ్చినట్లు ప్రకటించారు. కానీ వరద నష్టాన్ని పరిశీలిస్తే 42 అడుగుల మేర వరద వచ్చినట్లు తేలింది. జిల్లా చరిత్రలోనే ఇంతటి నష్టాన్ని ప్రజలు చూడలేదు. ఎగువ జిల్లాల్లో మున్నేరు, ఆకేరు పరీవాహకంలో భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగుపోయడం, కొన్నిచోట్ల తెగడం, దీనిపై ముందస్తుగా హెచ్చరికలు అందక ఖమ్మంను వరద ముంచెత్తినా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేపోయారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎగువ జిల్లాల్లో వరద, వర్షపాతం వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవడం.. ఆపై ప్రజలను అప్రమత్తం చేసేలా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది.

75 మంది అధికారులతో..

గత ఏడాది వరద పోటెత్తిన మున్నేరు, ఆకేరు పరీవాహకంలోని జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకునేలా.. ఖమ్మం జిల్లా అధికారులు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల అధికారులు 75మంది ఈ గ్రూప్‌లో ఉన్నారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖ ముఖ్య అధికారులే కాక ఖమ్మం కలెక్టర్, సీపీ, డీఆర్‌ఓ, కేఎంసీ కమిషనర్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులను యాడ్ చేశారు. ప్రతిరోజు రెండు పరీవాహకాల్లోని వర్షం, వరద, చెరువుల్లో నీటి నిల్వల సమాచారాన్ని ఈ గ్రూప్ ద్వారా ఇచ్చిపుచ్చుకుంటూ పరిస్థితిని అంచనా వేస్తున్నారు.

ఎగువ నుంచే వరద

మున్నేరు, ఆకేరు పరీవాహకంలోని 18 మండలాల్లో కుండపోత వర్షం కురిస్తేనే భారీ వరద చేరుతుంది. గత ఏడాది ఈ మండలాల్లో సగటున 30 సెం.మీ. నుంచి 35 సెం.మీ. వర్షపాతం ఒకే రోజులో నమోదైంది. దీంతో సదరు మండలాల్లో ప్రతిరోజు నమోదవుతున్న వర్షపాతం వివరాలను ఆయా జిల్లాల నీటిపారుదల, సీపీఓ కార్యాలయ అధికారులు వాట్సాప్ గ్రూప్‌లో పొందుపరుస్తున్నారు. నాలుగు గంటలకోసారి వర్షం హెచ్చరికలను కూడా పరస్పరం పంచుకుంటూ.. భారత వాతావరణ శాఖ ఐదు రోజులకోసారి జారీ చేసే రెడ్, ఎల్లో అలర్ట్ వివరాలు తెలుసుకుంటున్నారు. తద్వారా ఏ ప్రాంతంలో భారీ వర్షం పడనుంది, ఎక్కడ వరద వస్తుందో అంచనాకు వచ్చి అక్కడి ఉద్యోగులు.. ఆపై ప్రజలను అప్రమత్తం చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

కొత్తగా ఫ్లడ్ గేజ్‌లు..

మున్నేటికు గత ఏడాది వచ్చిన భారీ వరద తెలుసుకోవడానికి ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు పాత బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన గేజ్ ఆధారమైంది. ఈ గేజ్ ఆధారంగా గంటగంటకు ఎంత వరద వచ్చిందో అధికార యంత్రాంగం లెక్కలు వేసింది. కానీ ఎగువన ఉన్న మండలాల్లో ఎక్కడా ఫ్లడ్ గేజ్‌లు లేవు. దీంతో కి.మీ. దూరంలోనే వరద ఎన్ని అడుగులుగా ఉంది.. ఖమ్మం చేరే సరికి ఎన్ని అడుగులు పెరుగుతుందో అంచనా వేయడానికి జిల్లాలో మున్నేరు, ఆకేరుపై కొత్తగా మూడు ఫ్లడ్ గేజ్‌లను ఏర్పాటు చేశారు. ఖమ్మం రూరల్ మండలంలోని మున్నేటిపై పొలిశెట్టిగూడెం, తీర్థాల వద్ద, ఆకేరుపై ఖమ్మంరూరల్ మండలం తనగంపాడు వద్ద ఫ్లడ్ గేజ్‌ల బిగించారు.

పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి

బౌద్ధక్షేత్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అనుదీప్

నేలకొండపల్లి: జిల్లాను పర్యాటక రంగంలో అగ్రస్థానాన నిలిపేలా అందరూ సహకరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రాన్ని బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్యతో కలిసి గురువారం పరిశీలించిన ఆయన నిర్మాణంలో ఉన్న విశ్రాంతి భవనం, ఇతర పనులపై ఆరా తీశాక అధికారులతో చర్చించారు. ఇక్కడ అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.2.50 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. ఈ నిధులతో పర్యాటకుల విడిది కేంద్రం, మ్యూజియం, మెడిటేషన్ హాల్, బుద్ధుడి జీవిత చరిత్ర తెలిపే శిల్పాలు ఏర్పాటుచేయాలని, రెస్టారెంట్, బాలసముద్రం చెరువులో బోటింగ్‌కు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, డీఈ రామకృష్ణ, తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ సీ.హెచ్.శివ, మాజీ సర్పంచ్ రాయపూడి నవీన్, మాజీ ఎంపీటీసీ బొడ్డు బొందయ్య పాల్గొన్నారు.



బౌద్ధక్షేత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, మల్లేపల్లి లక్ష్మయ్య

రోప్‌వే ఏర్పాటుతో కొత్త అందం

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం ఖిల్లాపైకి రోప్‌వే ఏర్పాటైతే కొత్త అందం సంతరించుకుంటుందని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఖమ్మం ఖిల్లా, జాఫర్ బావిని గురువారం పరిశీలించిన ఆయన రూ. 29 కోట్లతో చేపట్టే రోప్ వే ఇతర పనులపై సమీక్షించారు. స్థల సేకరణ వారంలోగా పూర్తిచేసి పనులు మొలుపెట్టాలన్నారు. ఆర్డీఓ నర్సింహారావు, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి సుమన్ చక్రవర్తి, తహసీల్దార్ సైదులు, పర్యాటక శాఖ డీఈ రామకష్ణ, నిర్మాణ సంస్థ ప్రతినిధి వెంకటేష్ పాల్గొన్నారు.

కీలకమైన పనుల్లో జాప్యం

- 'మంచుకొండ లిఫ్ట్' వద్ద మొదలుకాని సబ్‌స్టేషన్ నిర్మాణం
- ఇది పూర్తయితేనే నడవనున్న మోటార్లు



చెరువులకు నీరు చేర్చేలా వేస్తున్న పైప్‌లైన్

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని సాగు భూములకు సాగర్ జలాలు చేరేలా రూ.66 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మంచుకొండ ఎత్తిపోతల పథకం కీలక పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే ప్రధాన పైపులైన్ ఏర్పాటుచేయడంతో పాటు మోటార్లు అమర్చి ట్రయల్ రన్ చేపట్టగా విజయవంతమైంది. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ నడుస్తుండడంతో రైతులు పైప్‌లైన్ పనులకు అభ్యంతరం చెబుతున్నా అధికారులు నచ్చచెబుతూ ముందుకు సాగుతున్నారు. కానీ పథకానికి కీలకమైన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం మొదలుకాకపోవడం గమనార్హం. సబ్‌స్టేషన్ నిర్మాణానికి జలవనరుల శాఖ రూ.2.53 కోట్లు కేటాయించినా నిధులు విద్యుత్ శాఖకు చేరితేనే పనులు ప్రారంభం కానున్నాయి. తాత్కాలికంగా విద్యుత్ లైన్లు వేస్తే మోటార్లు నడిచే పరిస్థితి ఉండదని అధికారులు చెబుతున్నారు.

రెండు మోటార్లు.. 36 చెరువులు

ఎత్తిపోతల పథకం ద్వారా తొలుత 27 చెరువులకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. వీ.వీ.పాలెం వద్ద సాగర్ ప్రధాన కాల్వపై నిర్మిస్తున్న ఈ పథకం ద్వారా మంచుకొండ వరకు 9 కి.మీ. ప్రధాన పైపులైన్.. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఐదు లింక్ చానళ్ల పైపులైన్లతో చెరువులకు నీరు సరఫరా చేయాలనేది పథకం ప్రధాన ఉద్దేశం. ఈమేరకు పైప్‌లైన్ల పనులు తుది దశకు చేరగా.. పాపటపల్లి, బూడిదంపాడు, ఈర్లపూడి, గడ్డికుంట తండా, రఘునాథపాలెం చెరువులకు నీరు చేరనుంది. ఆపై ఈర్లపూడి పైపులైన్‌ను పొడిగించి పంగిడి వరకు మరో తొమ్మిది చెరువులకు నీరు చేర్చే పనులు ప్రారంభించాల్సి ఉంది. ఈ వ్యవసాయ సీజన్‌లోనే చెరువులకు నీరు సరఫరా చేస్తామని ప్రకటించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. పనుల్లో జాప్యంతో ఇటీవల అధికారులపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎత్తిపోతలు మొదలు పెట్టాలంటే మోటార్లు నడవడానికి కీలకమైన సబ్‌స్టేషన్ పనులు ప్రారంభం కాకపోవడంపై ఆయన ఆరా తీసినట్లు సమాచారం. ఇకనైనా అవసరమైన నిధులను విద్యుత్ శాఖకు కేటాయించి యుద్ధప్రాతిపదికన సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తేనే రెండు మోటర్ల ద్వారా తొలుత ప్రతిపాదించిన 27 చెరువులే కాక మండలంలోని మొత్తం 36 చెరువులకు సాగర్ జలాలు చేరే అవకాశం ఉంది.

పదోన్నతులకు బ్రేక్..

ఉపాధ్యాయుల్లో ఆందోళన



ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2హెచ్ఎంలుగా, ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించేందుకు ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. సీనియారిటీ, ఖాళీల జాబితా విడుదల చేయడమే కాక సర్టిఫికెట్ల పరిశీలన మొదలవడంతో ఎస్ఏల్లో ఆనందం వ్యక్తమైంది. జిల్లాలో గ్రేడ్–2 హెచ్ఎంలుగా 260మంది ఎస్ఏలకు పదోన్నతులు లభించే అవకాశముందని భావించారు. ఈక్రమాన ఆప్షన్లు ఇచ్చేందుకు సిద్ధమవుతుండగా.. కొందరు తమకు అన్యాయం జరిగిందని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పదోన్నతులకు తాత్కాలికంగా బ్రేక్ వేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనెల 11వ తేదీన వాదనలు విన్నాక హైకోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా ప్రక్రియ ముందుకు సాగనుందని సమాచారం.

అర్హుల్లో ఆందోళన

గ్రేడ్–2 హెచ్ఎంలుగా పదోన్నతి కోసం ఎస్ఏలు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో షెడ్యూల్ విడుదల కాగానే ఆనందించినా.. ఇప్పుడు బ్రేక్ పడడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈనెల 11వ తేదీన కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందోనన్న అంశంపై ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అయితే, గురువారం కూడా పదోన్నతుల విషయమై పలువురు కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

ఆ దాడులు పాశవికం..



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు (ఇన్‌సెట్) గాజాలో పరిస్థితులను చూపేలా ప్రదర్శన

- పాలస్తీనా ప్రజలకు మద్దతుగా భారీ ప్రదర్శన
- పెద్దసంఖ్యలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీల, సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గాజాపై ఇజ్రాయిల్ పాశవికంగా చేస్తున్న దాడులను అన్నివర్గాల ప్రజలు నిరసించాలని.. ఇదే సమయాన శాంతి నెలకొల్పేందుకు దేశాధినేతలు కృషి చేయాలంటూ ఖమ్మంలో గురువారం పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీలు, సంఘాల నాయకులు, యువజనులు, విద్యార్థులు, న్యాయవాదులు, వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్న ఈ ప్రదర్శన పెవిలియన్ మైదానం నుండి మయూరిసెంటర్, వైరా రోడ్డు మీదుగా జెడ్పీ సెంటర్ వరకు కొనసాగింది. ఈసందర్భంగా పాలస్తీనా ప్రజలకు ఆహారం, నీరు అందకుండా వేలాదిమంది ఆకలి చావులకు కారణమవుతున్న ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ అక్కడ ప్రజల దీనస్థితిని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.

ఐక్యమత్యానికి నాంది..

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను అంతా ఖండించాలని సీపీఐ జాతీయ నాయకుడు అజీజ్ పాషా, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మధు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్ తదితరులు కోరారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిర్వహించిన ర్యాలీ ఐక్యమత్యానికి నాందిగా నిలుస్తుందని తెలిపారు. మానవత్వాన్ని మరిచిన ఇజ్రాయెల్ పాలస్తీనాపై దాడులు చేస్తుండగా.. ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసినప్పటికీ కేంద్రప్రభుత్వం స్పందించకపోవడం గర్హనీయమన్నారు. ర్యాలీలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు దండి సురేష్, వై.విక్రమ్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, బీ.జీ.క్లెమెంట్, మొక్క శేఖర్‌గౌడ్, మహ్మద్ హుస్సేన్, జైనుల్ పాషా, మహమ్మద్ ఇలియాస్, రవిమారుత్, కాకి భాస్కర్, ముప్వా శ్రీనివాస్, ఐ.వీ.రమణారావు, దేవిరెడ్డి విజయ్, బండారు రమేష్, వి.మనోహర్ రాజు, ఎంఎఫ్.గోపీనాథ్, రవీంద్రనాథ్, తిరుమలరావు, శేషగిరి, విప్లవ కుమార్, సుగుణరావు, జక్కంపూడి నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ఇటికాల రామకృష్ణ, వి.వెంకటేష్, టి.ప్రవీణ్, మస్తాన్, సురేష్, బషీర్, నానబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల పరిహారం స్వాహాపై విచారణ

వెటర్నరీ డాక్టర్ భర్త కనుసన్నల్లోనే అక్రమాలు?

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలాయపాలెం: గత ఏడాది వచ్చిన భారీ వరదతో మండలంలోని రాకాసితండాకు చెందిన పలువురు రైతులకు సంబంధించి పశువులు మృతి చెందాయి. వీటికి సంబంధించి పరిహారం పంపిణీలో జరిగిన అక్రమాలపై అధికారులు విచారణకు శ్రీకారం చుట్టారు. ఓ రైతు పేరిట మంజూరైన నగదు వెటర్నరీ డాక్టర్ భర్త ఖాతాలో జమ కావడం, వీటిని ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వ్యవహారం బయటపడింది. ఈ అంశంపై 'సాక్షి'లో ఇటీవల 'పశువుల పేరిట నిధుల స్వాహా' కథనం రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ నేతృత్వంలో డీటీ శర్మ, పశుసంవర్ధక శాఖ ఏడీ బోడేపూడి శ్రీనివాసరావు, జిల్లా వెటర్నరీ కార్యాలయ మేనేజర్ స్వర్ణలత గురువారం రాకాసితండాలో విచారణ చేపట్టారు. గత ఏడాది భారీ వరదతో 75 మంది రైతుల పశువులు, మేకలు, కోళ్లు చనిపోయినట్లు నిర్ధారించి రూ.55 లక్షల పరిహారం విడుదల చేశారు. అయితే, మండల వెటర్నరీ అధికారి అనూష ఇంటింటా పరిశీలిస్తూ నష్టాన్ని అంచనా వేయకుండా ఆమె భర్త సాయికుమార్‌కు పని అప్పగించడంతో ఆయన అక్రమాలకు తెరలేపినట్లు సమాచారం. ఈక్రమాన అధికారుల విచారణలో స్థానికులు ఎవరి జీవాలు ఎన్ని మృతి చెందాయో చెప్పలేకపోగా, గ్రామంలో లేని వారికి సైతం పరిహారం మంజూరైనట్లు బయటపడింది. దీంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు, ఆధార్‌కార్డుల పరిశీలనకు నిర్ణయించారు. ఈక్రమంలోనే వెటర్నరీ డాక్టర్ అనూషను రికార్డు సమర్పించాలని సూచించడమే కాక లబ్ధిదారుల ఎంపికలో ఆమె భర్త ప్రమేయంపైనా డీఆర్‌ఓ ప్రశ్నించారు.



రాకాసితండాలో వివరాలు సేకరిస్తున్న డీఆర్‌ఓ పద్మశ్రీ

జెడ్పీ సీఈఓ పేషీకి హిందీ టీచర్!

- తెలుగు నుంచి హిందీ అనువాదానికి డిప్యుటేషన్
- మౌఖిక ఆదేశాల కారణంగా జానకీపురంలో ఆగిన బోధన

బోనకల్: మండలంలోని జానకీపురం ఉన్నత పాఠశాలలో గత 15 రోజులుగా హిందీ ఉపాధ్యాయుడు లేక విద్యార్థులకు బోధన ఆగిపోయింది. విద్యార్థులకు నష్టం కలిగేలా ఉపాధ్యాయులకు మరోచోటకు పంపించొద్దనే ఆదేశాలు ఉండగా.. ఒకవేళ అత్యవసరమైన పరిస్థితుల్లో పంపించాల్సి వస్తే అదనంగా ఉన్న టీచర్లనే కేటాయించాలి. కానీ జానకీపురం ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడిని మౌఖిక ఆదేశాలతో డిప్యుటేషన్‌పై పంపించడం సమస్యకు కారణమైంది. పాఠశాలలో 138మంది విద్యార్థులు చదువుతుండగా, పది రోజులుగా హిందీ టీచర్ రాక ఆ సబ్జెక్టు బోధన నిలిచిపోయింది. విషయం ఏమిటని ఆరా తీయగా జెడ్పీ సీఈఓ దీక్షారైనాకు తెలుగు నుంచి హిందీలోకి అనువాదం చేసేలా సదరు ఉపాధ్యాయుడిని మౌఖిక ఆదేశాలతో కేటాయించినట్లు తెలిసింది. ఇంతవరకు బాగానే ఉన్నా రాతపూర్వక ఉత్తర్వులు లేకపోవడంతో ఆ స్థానంలో ఇంకో ఉపాధ్యాయుడిని కేటాయించడం సాధ్యం కాక విద్యార్థులకు హిందీ బోధన నిలిచిపోయింది. ఈ విషయమై బోనకల్ మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్యను వివరణ కోరగా మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

నాన్‌లోకల్ లోడింగ్ పేరుతో దోపిడీ

- చిన్న లారీల యజమానులకు తీరని నష్టం
- సమస్య పరిష్కారం కాక ఆవేదన

సత్తుపల్లి: ఓ వైపు బొగ్గు లోడింగ్ లేక.. మరో వైపు లోకల్, నాన్‌లోకల్ పేరుతో విభజన.. ఫైనాన్సర్ల వేధింపులు, పన్నులు చెల్లించలేక సత్తుపల్లికి చెందిన లారీల యజమానుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బొగ్గు లోడింగ్ కోసం ఆందోళనలు చేస్తే.. 40 శాతం నాన్‌లోకల్ లారీలకు లోడింగ్ ఇవ్వడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. రోజుకు 3వేల టన్నుల బొగ్గు లోడింగ్ వస్తే తప్ప స్థానిక లారీల యజమానులకు న్యాయం జరిగే అవకాశం లేదని చెబుతున్నారు. కానీ యూనియన్ బాధ్యులు సమస్యపై అధ్యయనం చేయకుండా యజమానులకు నష్టం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఫైనాన్స్ చెల్లించలేక ఇద్దరు యజమానులు ఆత్మహత్య చేసుకోవటం.. మరో ఇద్దరు మనోవేదనతో మృతి చెందడం వారి ఆందోళనను మరింత పెంచుతోంది.

ఏజెంట్లు చెప్పినట్లు వింటేనే..

కష్టం మాది.. డబ్బు ఏజెంట్లది అన్న చందంగా పరిస్థితులు మారాయని లారీల యజమానులు చెబుతున్నారు. కోల్ ట్రాన్స్‌పోర్టు ఏజెంట్లు చెప్పినట్లు వినకపోతే లోడింగ్ ప్రాధాన్యత తగ్గించి, కిరాయి చెల్లింపులోనూ ఆలస్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏజెంట్లతో కొందరు కుమ్మక్కై అంతా తామై నడిపిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. కొందరు ఏజెంట్లు లారీ కిరాయి ఐదారు రోజులు ఇవ్వకుండా సొంత అవసరాలకు వాడుకుంటున్నారని చెబుతున్నారు.

నాన్‌లోకల్ లోడింగ్‌తో..

40శాతం నాన్‌లోకల్ లోడింగ్‌తో స్థానిక లారీల యజమానులకు నష్టం జరుగుతోంది. ఇకనైనా ఆ నిబంధనను తొలగించి స్థానిక లారీలకే లోడింగ్ మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమై తే నాన్‌లోకల్ లోడింగ్‌కు ఇచ్చే కమీషన్ మినహాయించుకునైనా తమకు లోడ్ ఇవ్వాలనే భావన వ్యక్తమవుతోంది. కాగా, కొందరు పెద్ద లారీల యజమానులు సీలింగ్‌కు మించి నాన్‌లోకల్ పేరిట లోడ్ తీసుకుంటూ ఏజెంట్లకు వత్తాసు పలుకుతుండడంతో తమకు నష్టం జరుగుతోందని స్థానిక యజమానుల ద్వారా తెలిసింది. ఈ కారణంగా సింగిల్ లారీ ఉన్నవారికి 15–20 రోజులకు ఒక లోడ్ కూడా రాక ఫైనాన్స్ కిస్తీలు చెల్లించడంలో అవస్థ పడుతున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

పీఆర్ రోడ్ల పరిధిలో అటవీ భూమి సర్వే


జాయింట్ సర్వేలో డీఎఫ్ఓ, అధికారులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలోని భీమవరం – కాచారం, అయ్యవారిగూడెం – బుచ్చిరెడ్డిపాలెం మధ్య బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.22.5 కోట్లు విడుదలయ్యాయి. పీఆర్ శాఖ అధికారుల పర్యవేక్షణలో రహదారుల నిర్మాణం చేపట్టగా, మధ్యలో అటవీ భూమి ఉండగా అభ్యంతరాలతో పనులు నిలిచిపోయాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ మహేష్ గురువారం పరిశీలించారు. రెండు శాఖల ఆధ్వర్యాన సర్వే నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరెడ్డి, ఏఈ నరేష్, కాంగ్రెస్ నాయకుడు అనుమోలు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, అటవీ ప్రాంతంలో మరింత పచ్చదనం పెంచేలా కృషి చేస్తున్నట్లు డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ తెలిపారు. ఇందులో భాగంగా గురువారం జమలాపురంలోని అటవీ ప్రాంతంలో 500 సీడ్ బాల్స్ విసరగా ఆయన పాల్గొన్నారు. స్వచ్ఛంద సేవకుడు ఆదిత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన జిల్లా నాయకులు


ఖర్గే, సీఎం, డిప్యూటీ సీఎంతో నేతలు

ఖమ్మంమయూరిసెంటర్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను జిల్లా కాంగ్రెస్ నేతలు గురువారం ఢిల్లీలో కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగులు, హస్తకళల కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు ఖర్గేను కలిసిన వారిలో ఉన్నారు.

వీ.వీ.పాలెం పీఏసీఎస్‌లో సీఈఓలు, లెక్చరర్లు


రఘునాథపాలెం: జిల్లాలోని వివిధ పీఏసీఎస్‌ల సీఈఓలు, టెస్కాబ్ లెక్చరర్లు ఐదు రోజుల శిక్షణలో భాగంగా గురువారం మండలంలోని వీ.వీ.పాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ ఉపాధ్యక్షుడు రావెళ్ల శ్రీనివాసరావు, సీఈఓ తిరుపతిరావు సంఘం ద్వారా అమలవుతున్న కార్యకలాపాలు, అభివృద్ధిని వివరించారు. సాంకేతికతను వినియోగించుకుంటూ సంఘం అభివృద్ధి వేగంగా జరిగేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 35 పీఏసీఎస్‌ల సీఈఓలు, టెస్కాబ్ లెక్చరర్లు విజయకుమార్‌రెడ్డి, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ.. ఆరోగ్యం


లోగోతో డీఎఫ్ఓ సిద్ధార్థ్, సైక్లింగ్ క్లబ్ బాధ్యులు

ఖమ్మంవ్యవసాయం: సైక్లింగ్ ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యవంతమైన జీవనం సొంతమవుతుందని జిల్లా అటవీ అధికారి(డీఎఫ్ఓ) సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ తెలిపారు. ఖమ్మం సైక్లింగ్ క్లబ్ లోగోను గురువారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించడంతో పాటు మొక్క నాటాక మాట్లాడారు. సైక్లింగ్ ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చనే అంశాన్ని ప్రజలకు విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ విషయమై సైక్లింగ్ క్లబ్ కృషి చేయాలని డీఎఫ్ఓ తెలిపారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు


నాగులవంచ సొసైటీలో స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

చింతకాని: జిల్లాల్లో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయి, ఎవరైనా డీలర్లు కృత్రిమ కొరత సృష్టించాలన ప్రయత్నిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య హెచ్చరించారు. చింతకాని మండలం నాగులవంచ, లచ్చగూడెం, నాగిలిగొండ, పాతర్లపాడుల్లో సొసైటీలు, ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేశాక ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి మండలానికి రావాల్సిన ఎరువుల కోటా పంపిస్తున్నందున రైతులను ఇబ్బంది పెట్టకుండా విక్రయిస్తూ రికార్డులు పక్కాగా నిర్వహించాలని సూచించారు. సరిపడా నిల్వలు ఉన్నందున రైతులు కూడా ఆందోళనకు గురికావొద్దని డీఏఓ సూచించారు. ఏఓ మానస, నాగులవంచ సొసైటీ సీఈఓ యాలముడి శ్రీనివాసరావు, ఏఈఓలు పాల్గొన్నారు.

చర్చించండి.. పరిష్కరించండి

పెద్దాస్పత్రిని వేధిస్తున్న సౌకర్యాల కొరత

- వేతనాలు అందక తరచుగా కార్మికుల సమ్మె
- ‘ప్రైవేట్’కు వెళ్లేనే ఎంఆర్‌ఐ సేవలు
- నేడు కలెక్టర్ అధ్యక్షతన ‘హెచ్‌డీఎస్’ సమావేశం


వర్షానికి కురుస్తున్నపాత భవనం


కంకర తేలిన అంతర్గత రహదారి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి కొన్నేళ్లుగా తాకిడి పెరిగింది. నిత్యం 1,500 నుంచి 2వేల వేల మంది వైద్యసేవలకు వస్తుండగా వారి సహాయకులతో పాటు వైద్యులు, సిబ్బంది సుమారు 5వేల మంది రాకపోకలు సాగిస్తారు. ఇవన్నీ చెప్పుకోవడానికి బాగానే ఉన్నా నామమాత్రపు సౌకర్యాలు, పరికరాలతో ఆశించిన స్థాయిలో వైద్యం అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. పెద్దాస్పత్రికి అనుసంధానంగా ప్రభుత్వం మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయటంతో వైద్య విధాన పరిషత్ పరిధి నుండి 2023 నవంబర్‌లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి వెళ్లింది. దీంతో నిపుణులైన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను కేటాయించినా రోగులకు నామమాత్రపు సేవలే అందుతుండడం గమనార్హం. కలెక్టర్ అనుదీప్ అధ్యక్షతన శుక్రవారం (నేడు) పెద్దాస్పత్రిలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డీఎస్) ముందస్తు సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఆస్పత్రి సమస్యలు, వైద్య సేవల్లో లోటుపాట్లపై చర్చించి పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఎంఆర్‌ఐ సేవలకు ఎదురుచూపు

పెద్దాస్పత్రిలో ఏళ్లుగా ఎంఆర్‌ఐ సేవలు అందని ద్రాక్షలానే మారాయి. నిత్యం 50 మందికి పైగా ఇన్‌పేషంట్లు చేరుతుండగా, చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా తాకిడి ఉంటోంది. ఎక్స్‌రే, సిటీ స్కాన్ అందుబాటులో ఉన్నా ఎంఆర్‌ఐ సేవలు ప్రతిపాదనలకే పరిమితం కావడంతో అవసరమైన వారు బయటి సెంటర్లలో రూ.3వేల నుండి రూ. 10వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది.

తీరని కార్మికుల వేతన సమస్య

ఆస్పత్రి కార్మికులకు నెలనెలా వేతనాలు అందడం లేదు. ఆస్పత్రి వీవీపీ పరిధిలో ఉన్నప్పుడు 575పడకలకు అనమతి ఉంది. ఆ లెక్క ప్రకారం పేషంట్ కేర్, సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికుల వేతనాల కోసం ఏజెన్సీకి ప్రభుత్వం రూ. 50 లక్షలు చెల్లించేది. కానీ డీఎంఈ పరిధిలోకి వెళ్లాక కాలేజీలో 100 సీట్లకు అనుగుణంగా 430 బెడ్లకే అనుమతి ఇచ్చి ఏజెన్సీకి రూ.35 లక్షలు మాత్రమే చెల్లిస్తోంది. దీంతో కాంట్రాక్టర్ కార్మికులకు నెలనెలా జీతాలు ఇవ్వలేకపోతుండడంతో తరచూగా సమ్మెకు దిగడం.. ఒక నెల వేతనం చెల్లించి విధుల్లోకి తీసుకోవడం పరిపాటిగా మారింది.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

జిల్లా జనరల్ ఆస్పత్రి మెడికల్ కళాశాల పరిధిలోకి వెళ్లి రెండేళ్ల కావొస్తున్నా రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. ఫలితంగా రోడ్లు గుంతలమయమై రోగులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక చిన్నపాటి వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిలిచి మరింత సమస్య ఎదురవుతోంది.

కురుస్తున్న పాత భవనం

అరవై ఏళ్ల క్రితం నిర్మించిన ఆస్పత్రి పాతభవనం కొద్దిపాటి వర్షానికి కురుస్తోంది. పాత భవనంలో మినిస్టీరియల్ విభాగాలు, సూపరింటెండెంట్ కార్యాలయం, ల్యాబ్‌లు, ఎయిడ్స్ విభాగాలు ఉన్నాయి. భవనం పాతది కావటంతో స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడంతో వర్షం మొదలుకాగానే నీరు కారుతోంది. పాత భవనం స్థానంలో నూతన భవన నిర్మాణం ప్రతిపాదనలు ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు.

మౌలిక సదుపాయాలు కరువు

నిత్యం వేలాది మంది వచ్చివెళ్లే ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోంది. కనీస స్థాయిలో మరుగుదొడ్లు లేకపోగా ఉన్నవి అధ్వానంగా తయారయ్యాయి. తరచూ పైప్‌లైన్లు లీకేజీతోమురుగు నీరు బయటకు వస్తోంది. నీరు నిల్వ చేయటానికి పాత సంపులు సరిపోక నీటి కొరత కూడా వేధిస్తోంది. అలాగే అత్యవసర విభాగాల్లో ఏసీలు సరిపడా లేకపోగా.. జనరల్ సర్జరీ, ఆర్థో పెడిక్ సర్జరీ విభాగాల్లో కావాల్సిన పరికరాలు, ఆల్ట్రా సౌండ్ మిషన్, పిల్లలకు కావాల్సిన టూడీ ఎకో, డాప్లర్ మిషన్ పరికరాలను సమకూర్చాల్సి ఉంది.

లోటుపాట్లు, కావాల్సిన సౌకర్యాలపై చర్చ



కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం హెచ్‌డీఎస్ ముందస్తు సమావేశం జరగనుంది. ఆస్పత్రిలో అవసరమైన సదుపాయాలు, సౌకర్యాలపై సమావేశంలో చర్చించేలా అజెండా రూపొందించాం. కలెక్టర్ చైర్మన్‌గా, డీఎంఈ వైస్ చైర్మన్‌గానే కాక 17మందితో కమిటీ ఉంటుంది. ఈ సమావేశంలో సమస్యలపై చర్చించి, ప్రతిపాదనలను ఆమోదించే అవకాశముంది.

– ఎం.నరేందర్, మెడికల్ సూపరింటెండెంట్

15నాటికి దరఖాస్తుల పరిష్కారం

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: భూభారతి చట్టానికి సంబంధించి రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల పరిష్కారం ఈనెల 15 నాటికి పూర్తయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. దరఖాస్తుల స్థితిగతులు, పరిశీలన, పరిష్కారంపై ఆరా తీసిన ఆయన 15 నాటికి పరిష్కరించేలా సూచనలు చేశారు. మొత్తం 75 వేల దరఖాస్తులు రాగా, సాదా బైనామావి మినహాయించి మిగతా దరఖాస్తులు పరిశీలిస్తూ తిరస్కరిస్తే కారణాలు తెలపాలని చెప్పారు. ప్రతీ మండలంలో పది శాతం దరఖాస్తులను తనిఖీ చేస్తామని తెలిపారు. కాగా, భూభారతి దరఖాస్తులు పరిష్కారమయ్యే వరకు రెవెన్యూ ఉద్యోగులు సెలవు తీసుకోవద్దని సూచించారు. తొలుత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పురోగతి, లబ్ధిదారుల ఎంపికపై అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీఓ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

■ జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా మౌలిక వసతుల కల్పనపై అధికారులు శ్రద్ధ వహించాలని కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ సూచించారు. తెలంగాణ, ఝార్ఖండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల కలెక్టర్లతో గురువారం వీసీ ద్వారా మాట్లాడిన ఆయన జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ పథకాల అమలు, ఎప్పటికప్పుడు పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ అధికారులతో సమావేశమై రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో తాగునీటికి పనులపై ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. మిషన్ భగీరథ ఎస్ఈ శేఖర్‌రెడ్డి, ఈఈలు పుష్పలత, వాణిశ్రీ పాల్గొన్నారు.

చేనేత రంగం బలోపేతానికి కృషి


కార్మికులకు చెక్కు అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంగాంధీచౌక్: చేనేత రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు కార్మికులకు అండగా నిలిచేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ముందు తరాలు కూడా చేనేత దుస్తులపై ఆసక్తి పెంచుకునేలా ప్రస్తుత తరం వారు చేనేత వస్త్రాలనే ధరించాలని సూచించారు. అలాగే, కార్మికులు తెలంగాణ నేతన్న పొదుపు పథకం, భద్రతా పథకం, భరోసా పథకం, రుణమాఫీ పథకాలను వినియోగించుకుంటూ వృత్తిలోఎదగాలని తెలిపారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి.. కార్మికులకు పథకాల చెక్కులు అందజేశారు. చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం..విజయలక్ష్మి, కార్యాలయ ఉద్యోగులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

కదిలించిన ‘ఎడారిలో వాన చినుకు’

ప్రారంభమైన నాటికల పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న నెలనెలా వెన్నెల నిర్వాహకులు


‘ఎడారిలో వాన చినుకు’ నాటికలోని ఓ సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు గురువారం రాత్రి ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. నెలనెలా వెన్నెల 8వ వార్షికోత్సవం సందర్భంగా నాలుగు రోజుల పాటు ఈ పోటీలు ఏర్పాటుచేశారు. తొలిరోజు రెండు నాటికలను ప్రదర్శించగా ఏపీలోని కాకినాడకు చెందిన శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్ వారి ‘ఎడారిలో వాన చినుకు’ నాటిక కంట తడి పెట్టించింది. అల్లారుముద్దగా పెంచుకున్న కొడుకు పెళ్లి తర్వాత భార్య మాటలు విని తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో వదిలేయడం, అమెరికా నుంచి వచ్చిన ఇంకో వ్యక్తి వారిని దత్తత తీసుకునేందుకు ముందుకొస్తే కుమారుడు రూ.25 లక్షలకు బేరం పెట్టడం ఇతివృత్తంగా ప్రదర్శించిన ఈ నాటిక అందరినీ కదిలించింది. ఈ నాటికను శారద ప్రసన్న రచించగా, సీహెచ్.మహేష్ దర్శకత్వం వహించారు. ఆతర్వాత హైదరాబాద్ కళాంజలి కళాకారులు ‘కొత్తభూతం’ నాటికను ప్రదర్శించారు. శ్రీకాళహస్తి నాగరాజు రచించిన ఈ కథకు సాదినేని శ్రీజ నాటకీకరణ చేయగా, కె.రాధాకృష్ణ దర్శకత్వం వహించారు.

అందరి సహకారంతో...

నాటక పోటీలను అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ బాధ్యులు అన్నాబత్తుల పుష్పరాణి, ఖమ్మం కళా పరిషత్ కార్యదర్శి వేల్పుల విజేత, అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, డాక్టర్ నాగబత్తిని రవి, బయ్యన బాబు, మోటమర్రి జగన్మోహన్ రావు, నామ లక్ష్మీనారాయణ, వేముల సదానందం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా, పోటీలకు వివిధ జిల్లాల నుంచి 180మంది కాకారులు హాజరుకాగా ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి వారికి వసతి, భోజనం, అల్పాహారం సమకూర్చడంపై కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఎడారిలో వానచినుకు నాటికకు జిల్లా ఎన్నారై ఫౌండేషన్ అధ్యక్షులు బాబు బయ్యన పారితోషికం అందించగా, ఎన్నారై ఫౌండేషన్ నుంచి రూ. లక్ష చెక్కును పేద విద్యార్థుల చదవులకు అందించారు.

అష్టైశ్వర్యాలు ప్రసాదించు తల్లీ..

నేడు వరాల దేవత వరలక్ష్మీ వ్రతం


ఖమ్మం రహదారులపై పూల అమ్మకం

ఖమ్మంగాంధీచౌక్: శ్రావణ మాసం అంటే వ్రతాలు, పూజలు, పండుగలకు ప్రత్యేకం. ఈ మాసంలో మహిళలు ప్రత్యేకంగా వరలక్ష్మీ వ్రతం జరుపుకుంటారు. అష్టైశ్వర్యాలను ప్రసాదించే వరలక్ష్మీ దేవి వ్రతాన్ని శ్రావణ మాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం ఆచరించడం ఆనవాయితీ. మహిళలు దీర్ఘ సుమంగళిగా ఉండాలని, యువతులు మంచి భర్త లభించాలని, పెళ్లయిన వారు మంచి సంతానం కోసం వ్రతం చేయడమే కాక దేవతను పూజిస్తే అష్ట లక్ష్మి పూజలతో సమానమని నమ్ముతారు.

వ్రతానికి సన్నద్ధం..

వరాలను ఇచ్చే వరలక్ష్మి అమ్మవారి వ్రతానికి మహిళలు సిద్ధమయ్యారు. ఈమేరకు పూలు, మామిడాకులు, పండ్లు, అమ్మవారి చిత్రపటాలు ఇతర సామగ్రి కొనుగోళ్లతో నిమగ్నమయ్యారు. దీంతో గురువారం సాయంత్రం ప్రధాన వీధుల్లో రద్దీ నెలకొనగా పూలు, పండ్లకే కాక కొబ్బరికాయలకు డిమాండ్ పెరిగింది. బంతి, చామంతి పూలు కిలో ధర రూ.450 దాటగా, కొబ్బరి కాయలను రూ.35కు పైగా అమ్మారు. కాగా, పలువురు మహిళలు సామూహికంగా వరలక్ష్మి వ్రతం ఆచరిస్తారు. ఇందుకోసం ఆలయ కమిటీల నేతృత్వాన ఏర్పాట్లు చేశారు. ఇంకొందరు ఇళ్లలోనే వ్రతం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కసుమూరి అంజయ్య(42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్నాళ్లుగా మద్యానికి బానిసైన ఆయన బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గతంలోనూ ఓసారి అంజయ్య పురుగుల మందు తాగగా చికిత్స చేయించి బతికించుకోగా, ఈసారి మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆయన కుమారుడు ఆకాష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు...

తిరుమలాయపాలెం: ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని గోపాలపురానికి పెయింటర్ కొప్పుల ప్రవీణ్‌కుమార్(29)కు ఆర్థిక ఇబ్బందులు ఎదురయాయ్యయి. దీంతో ఆందోళనకు గురైన ఆయన బుధవారం పురుగుల మందు తాగగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా గురువారం మృతి చెందాడు. ఆయన తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇరిగేషన్ ఉద్యోగి మృతి

కూసుమంచి: మండలంలోని పాలేరులో సాగర్ ఔట్‌ఫాల్ కెనాల్ వంతెనపై గురువారం బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా ఇరిగేషన్ శాఖ ఉద్యోగి మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం చెన్నూరుగూడెం గ్రామానికి చెందిన బండ్ల హుస్సేన్(57) ఇరిగేషన్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్నాడు. విధుల్లో భాగంగా పాలేరు వస్తున్న ఆయన ద్విచక్ర వాహనంపై ఔట్‌ఫాల్ కెనాల్ వద్దకు రాగానే మధిర డిపో ఆర్టీసీ బస్సు వెనక నుండి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అవయవాలు ఛిద్రం కాగా హుస్సేన్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన కుమారుడు అనిల్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని కూసుమంచి ఎస్సై నాగరాజు తెలిపారు.

కలకోటలో గాయాలు

బోనకల్: బోనకల్ మండలం కలకోట సీఎస్‌ఐ చర్చి సమీపాన గురువారం ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మధిర నుండి బస్సు ఆళ్లపాడు వెళ్తుండగా, మోటమర్రి నుంచి మధిర వెళ్తున్న కూలీలు గుడిద కోటయ్య, చింతల కృష్ణ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. వీరిద్దరికి తీవ్రగాయాలు కావడంతో 108లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పొదిలి వెంకన్న వెల్లడించారు.

పొంగి పొర్లిన వాగులు

రాకపోకలకు అంతరాయం


రఘునాథపాలెం బుగ్గవాగు వద్ద పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ, ఉద్యోగులు


ఉధృతంగా ప్రవహిస్తున్న పొన్నేకల్ బుగ్గవాగు


కారేపల్లి : వరి పొలాల్లో చేరిన నల్లవాగు వరద

రఘునాథపాలెం/కామేపల్లి: రఘునాథపాలెం మండలం పాపటపల్లి – వీఆర్.బంజర మధ్య గురువారం మధ్యాహ్నం బుగ్గ వాగుకు వరద పోటెత్తింది. రహదారిపైకి రెండు అడుగుల మేర నీరు చేరడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇల్లెందు వైపు కురిసిన భారీ వర్షాలతో వాగులోకి వరద చేరినట్లు తెలుస్తుండగా, అధికారులు రెండు వైపులా ట్రాక్టర్లు ఏర్పాటుచేసి ఎవరూ వెళ్లకుండా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఆర్‌ఐ వహీద్, గ్రామ కార్యదర్శులు నాగరాజు, హిమబిందు, పోలీసులు పర్యవేక్షించారు. అలాగే, కామేపల్లి మండలంలోని పొన్నేకల్ బుగ్గవాగు సైతం ఉధృతంగా ప్రవహించింది. బ్రిడ్జి మీదుగా ప్రవాహం ఉండడంతో లింగాల – డోర్నకల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో ఎవరూ వెళ్లకుండా తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్ ఆధ్వర్యాన ట్రాక్టర్లు ఏర్పాటుచేయించారు.

■ కారేపల్లి: కారేపల్లిలోని నల్లవాగు పొంగి పొర్లడంతో దీని పరిధిలోని పెద్ద చెరువు ఆయకట్టులో పొలాలు కొట్టుకుపోయాయి. పెద్ద చెరువు ఆయకట్టులో వారం రోజులుగా రైతులు వరి నాట్లు వేస్తుండగా, ప్రస్తుత వరదతో సుమారు వంద ఎకరాల్లో పొలాలు మునిగి నారు కొట్టుకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.